## ప్రజల జీవన ప్రమాణాల పెరుగుదలా ?
## అధునాతన సాంకేతిక పరికరాల వినియోగమా?
## ఏది నిజమైన అభివృద్ధి ?

"పట్టణాలంటే అభివృద్ధి, సంపద. పల్లెటూర్లంటే వెనుకబాటుతనం, పేదరికం. మహానగరాలంటే అవధుల్లేని అభివృద్ధి, అనంతమైన సంపద". ఇది ఒక మిథ్యా భావజాలం. కార్పొరేట్ శక్తులు ప్రసార సాధనాల ద్వారా ఊదరగొడుతున్న భావజాలం. తాము ప్రవచిస్తున్న అభివృద్ధి నమూనాలో పేదలకూ, రైతులకూ, సమాజపు అంచులలో బతుకుతూ పూర్తి స్థాయి పౌరులుగా గుర్తించబడని సమూహాలకూ ఏ మాత్రం స్థానం కల్పించని భావజాలం. భూమి, నీరు లాంటి సహజ వనరులను కార్పొరేట్ దిగ్గజాలకు నైవేద్యంగా సమర్పిస్తూ, వాళ్ళ కరుణాకటాక్షాలతో వేల కోట్ల రూపాయల అక్రమ సంపదను కూడగట్టుకుంటూ, ప్రజలకు కేవలం అభివృద్ధి మంత్రాలను మాత్రమే వల్లించే పాలకులు ప్రచారం చేస్తున్న భావజాలం. సమాజంలోని కొద్దిమంది అపరకుబేరులుగా మారటమే అభివృద్ధి అనీ, వాళ్ళ దగ్గర పోగుపడిన సంపద బొట్లు బొట్లుగా క్రిందికి జారి, మిగతా ప్రజా సమూహాల జీవితాలు కూడా క్రమక్రమంగా మెరుగుపడతాయనీ, ఈ నమూనా తప్ప సమాజాభివృద్ధికి మరో ఆచరణాత్మక ప్రత్యామ్నాయం లేదనీ దబాయిస్తున్న భావజాలం. పసిడి పంటలు పండే 29 గ్రామాల వ్యవసాయ భూముల్ని చదునుచేసి, కార్పొరేట్ సంస్థలకు స్వర్గధామంలాంటి మహానగరాన్ని నిర్మిస్తామంటే, రావల్సినంత వ్యతిరేకత రాకుండా ప్రజలను భ్రమలలో ముంచెత్తుతున్న భావజాలం.

ఈ భావజాల వ్యతిరేక చైతన్యాన్ని ప్రజల్లో పెంపొందించేందుకు నిరంతరం కృషి చేస్తున్న సంస్థ మానవ హక్కుల వేదిక. బహుళ అంతస్తుల గాజు భవంతులో, అధునాతన సాంకేతికతో, ఎక్కువ విస్తీర్ణంలో నిర్మించటమో, ప్రపంచ స్థాయి రాజధానికి గీటురాళ్ళు కావని మేం నమ్ముతున్నాం. ప్రజల జీవన ప్రమాణాలు పెంపొందించే విధంగా, అట్టడుగు వర్గాల, కులాల ప్రజలకు కూడా అన్ని వనరులూ అందుబాటులోకి వచ్చే విధంగా రాజధాని నగర నిర్మాణం జరగాలని మేం భావిస్తున్నాం. పర్యావరణ సమతుల్యతకు భంగం కలిగించని రాజధాని నిర్మాణాన్ని మేం కాంక్షిస్తున్నాం.

గ్రామీణాభివృద్ధిని గాలికొదిలేయటం మూలంగా గ్రామాలనుండి పట్టణాలకు పెద్ద ఎత్తున వలసలు జరుగుతున్నాయని మేం అభిప్రాయపడుతున్నాం. వ్యవసాయం గిట్టుబాటు కావటానికి ప్రభుత్వ విధానాల్లో చెయ్యాల్సిన మార్పుల్ని గురించీ, గ్రామీణ ప్రాంతాల్లో కూడా నాణ్యమైన విద్య, మెరుగైన వైద్యసేవలు అందుబాటులోకి రావటానికి అనుసరించాల్సిన విధానాల గురించీ ఆలోచించకుండా, స్మార్ట్ సిటీల వెంట పరుగెత్తటం సరికాదంటున్నాం. స్మార్ట్ సిటీల నిర్మాణానికి కావలసిన లక్షల ఎకరాల భూముల్ని భవిష్యత్‌లో నిరాటంకంగా సేకరించటానికి వీలుగా, భూసేకరణ చట్టంలో మార్పులూ చేర్పులూ చేయటాన్నీ, దాన్ని ప్రజలమీద ప్రయోగించటాన్ని వ్యతిరేకిస్తున్నాం. కార్పొరేట్ శక్తుల, బహుళ జాతి సంస్థల లాభాల కోసం రైతాంగ ప్రజల, అట్టడుగు కులాలకు, వర్గాలకు చెందిన ప్రజా సమూహాల జీవితాల్ని బలి ఇవ్వటాన్ని తీవ్రంగా ఖండిస్తున్నాం.

ఇటువంటి అనేక అంశాలను చర్చకు పెడుతూ **మానవ హక్కుల వేదిక** (HRF) **4వ జిల్లా మహాసభలను తెనాలిలో జులై 19న జరుపుకుంటోంది**. మా ఈ కృషిలో కలసి రమ్మనీ, మానవ హక్కుల వేదిక (HRF) చేపట్టే కార్యక్రమాలకు అన్ని విధాలైన సహాయ, సహకారాలు అందించమనీ, మా జిల్లా మహాసభల సందర్భంగా జరిగే బహిరంగ సభను జయప్రదం చేయమనీ అందరికీ విజ్ఞప్తి చేస్తున్నాం.

| | | |
|---|---|---|
| వేదిక | : | **సీనియర్ సిటిజన్స్ భవనము, కవిరాజా పార్కు, నందులపేట, తెనాలి.** |
| తేది | : | **19-7-2015 ఆదివారం సాయంత్రం 6 గంటలకు** |
| అధ్యక్షత | : | **శ్రీ యస్. జీవన్‌కుమార్,** హెచ్.ఆర్.ఎఫ్. ఉభయ రాష్ట్రాల అధ్యక్షుడు |
| వక్తలు | : | **శ్రీ వడ్డే శోభనాద్రీశ్వరరావు,** మాజీ మంత్రివర్యులు |
| అంశం | : | **సింగపూర్ ఇచ్చిన రాజధాని ప్రణాళికలో లోటుపాట్లు - ఆచరణాత్మక ప్రత్యామ్నాయాలు** |
| | : | **ఆచార్య సి. రామచంద్రయ్య,** ఫాకల్టీ, అర్బన్ స్టడీస్, సెంటర్ ఫర్ ఎకనామిక్ & సోషల్ స్టడీస్, హైద్రాబాద్. |
| అంశం | : | **కార్పొరేట్ రాజధానా ? - ప్రజా రాజధానా ?** |
| | : | **డా॥ కె. బాబూరావు,** పర్యావరణవేత్త |
| అంశం | : | **రాజధాని నిర్మాణం - పర్యావరణ సమస్యలు** |
| | : | **శ్రీ ఎ. చంద్రశేఖర్,** హెచ్.ఆర్.ఎఫ్, ఉభయ రాష్ట్రాల ఉపాధ్యక్షుడు |
| అంశం | : | **అసమాన అభివృద్ధి - రాయలసీమ దుస్థితి** |

**మానవ హక్కుల వేదిక (హెచ్.ఆర్.ఎఫ్), గుంటూరు జిల్లా కమిటీ.**